తాగునీటి కోసం నాలుగేళ్లుగా ఎదురుచూపులు

- వడ్డెరబస్తీలో అంగన్‌వాడీ, బస్తీ దవాఖానా భవనాలు ఒకేచోట
- నీటి కనెక్షన్ ఇవ్వని అధికారులు
- ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీ చిన్నారులు.. బస్తీ దవాఖాన సిబ్బంది, రోగులు

ప్రభుత్వ శాఖల అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల సమన్వయలోపంతో అడిక్‌మెట్ డివిజన్ వడ్డెరబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులు, సిబ్బందితో పాటు బస్తీదవాఖానాకు వచ్చే రోగులు, సిబ్బంది తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు. నాలుగేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



వడ్డెరబస్తీలోని ఒకే సముదాయంలో ఉన్న అడిక్‌మెట్ అంగన్‌వాడి కేంద్రం, బస్తీ దవాఖానా

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్‌లోని కోవు గుంత ప్లే గ్రౌండ్‌లో నాలుగు సంవత్సరాల క్రితం జీహెచ్‌ఎంసీ బస్తీ దవాఖానతోపాటు అంగన్‌వాడీ కేంద్రానికి ఒకేచోట భవనం నిర్మించారు. తాగునీటి సదుపాయం కోసం బోరు వేయలేదు. జలమండలి అధికారులు నీటి కనెక్షన్ ఇవ్వలేదు. అంగన్‌వాడీ సిబ్బంది చుట్టుపక్కల ఇళ్ల నుంచి నీటిని తెచ్చి చిన్నారులకు ఇస్తున్నారు. అప్పుడప్పుడు మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. ఇక నీటి సదుపాయం లేక అంగన్‌వాడీలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు నిరుపయోగంగా ఉన్నాయి.

బస్తీదవాఖానలో..

బస్తీదవాఖానలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్నారులు తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

ప్రస్తుతం వేసవికాలం ప్రారంభం కావడంతో తాగునీటి సమస్య మరింత తీవ్రం కానుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అంగన్‌వాడీ, బస్తీ దవాఖానకు వచ్చే వారి కోసం బోరింగ్ లేదా జలమండలి నీటి కనెక్షన్ ఇచ్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదు



అడిక్‌మెట్‌లోని బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రంలో తాగునీటి కోసం బోరింగ్ వేయాలని, నీటి కనెక్షన్ ఇవ్వాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. జీహెచ్‌ఎంసీతో పాటు జలమండలి అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా స్పందించడం లేదు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

● తాండూరీ గౌరీశంకర్, స్థానికుడు


భరతనాట్య నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులతో వేణుగోపాలచారి తదితరులు

మహిళలు ధైర్యంగా ఉండాలి

● కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మహిళలు ధైర్యంగా ఉండాలని కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. కళాప్రదర్శనలు పిల్లల్లో సంస్కారం, ఏకాగ్రత, విజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. సోమవారం శ్రీశృంగేరీ శంకరమఠం సౌజన్యంతో శ్రీఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్, శ్రీలాస్య నృత్యాలయ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శంకరమఠంలో భరతనాట్య నృత్యప్రదర్శన జరిగింది. యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువు విశాఖ ప్రకాష్ శిష్యురాళ్లు భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. నృత్య కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కళాకారులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది పార్వతి, బుర్ర మోహన్‌కృష్ణ, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు పాలపర్తి సంధ్యారాణి, కన్వీనర్ రఘుశ్రీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణరాయబారం నాటక ప్రదర్శన

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ నటుడు వల్లూరు శ్రీహరిరావు త్యాగరాయగానసభలో సోమవారం సాయంత్రం ప్రదర్శించిన శ్రీకృష్ణరాయబారం పద్యనాటక ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీహరిరావు 60 సంవత్సరాలుగా పౌరాణిక పద్యనాటకాలు ప్రదర్శిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. శ్రీకృష్ణుడిగా వల్లూరు శ్రీహరిరావు, దుర్యోధనుడిగా రామ్‌జీ, అర్జునుడిగా ఎర్రిస్వామి చౌదరి, కర్ణుడిగా కృష్ణశాస్త్రి, భీష్ముడిగా సూర్యనారాయణమూర్తి, విదురుడిగా సోమయ్య, వికర్ణుడిగా రాజనాల నాగేశ్వరరావు, గాంధారిగా సూర్యకుమారి నటించారు.

హర్ ఆర్ట్ గ్యాలరీని సందర్శించిన ప్రవాసాంధ్రులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హర్ ఆర్ట్ గ్యాలరీని ప్రవాసాంధ్రులు సోమవారం సందర్శించారు. అమెరికాలో నివసిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రాజమోహనరెడ్డి, అనుపమ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన కళారూపాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు. హస్తకళాకారిణి, గ్యాలరీ డైరెక్టర్ కమలాప్రసాదరావును అభినందించారు. కార్యక్రమంలో ప్రైవేట్‌రంగ ఉద్యోగుల సంఘం సభ్యులు శశిభూషణశర్మ, మోహనకులకర్ణి, జాతీయ క్రీడాకారులు రామ్మోహన్, రాంబాబు, గ్యాలరీ చైర్మన్ కె.ధర్మారావు, ఎండీ పీవీఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు.

'అరవింద్ కేజ్రీవాల్‌పై ఆరోపణలను బీజేపీ నిరూపించాలి'

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అరవింద్ కేజ్రీవాల్‌పై చేసిన ఆరోపణలను బీజేపీ ఆరు నెలల్లో నిరూపించాలని ఆప్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆప్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేజ్రీవాల్‌పై బీజేపీ చేసిన ఆరోపణలు నిరూపిస్తే తమ పార్టీ రాజకీయాల నుంచి తప్పుకుంటుందని, లేకుంటే బీజేపీ తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్ పార్టీ నాయకుడు సాల్మన్‌రాజ్, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు మాట్లాడుతూ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఆప్‌లో చేరారు. సమావేశంలో నాయకులు రాముగౌడ్, డాక్టర్ అన్సారీ, జావిద్‌షరీఫ్, రాజేశ్వర్, ఉమారాణి, చందర్, నిజాముద్దీన్, సుల్తాన్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'చిలుకూరి ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి అమానుషం'

రాంనగర్/నల్లకుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిలుకూరి ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి అమానుషమని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం నల్లకుంటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామరాజ్యం స్థాపించాలనే పేరుతో కొందరు దాడులు చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

కాసాని ఐలయ్య సంస్మరణ సభలో నివాళులర్పించిన నేతలు



గొర్ల కాపర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కాసాని ఐలయ్య సంస్మరణ సభ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సోమవారం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి రవీందర్ ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం మాజీ అధ్యక్షుడు జంగయ్య, నాయకులు యాదయ్య, చంద్రశేఖర్, లింగయ్య, శంకర్, అశోక్, రాజు పాల్గొన్నారు. రాంనగర్, ఆంధ్రజ్యోతి


శిక్షణ శిబిరంలో తెలంగాణ మహిళా ఉద్యమకారులు

తెలంగాణ మహిళా ఉద్యమకారుల శిక్షణ శిబిరం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఉప్పల్‌లో జరిగిన తెలంగాణ మహిళా ఉద్యమకారుల శిక్షణ శిబిరం విజయవంతమైందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి, ప్రధానకార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి తెలిపారు. సోమవారం సాయంత్రం వారు చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ ఈ శిబిరానికి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 250 మంది తెలంగాణ మహిళా ఉద్యమకారులు హాజరయ్యారని తెలిపారు. నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, రకరకాల ట్యాక్స్‌లతో ప్రజలపై వేధింపులు, కుయుక్తులు తిప్పికొట్టి దేశాన్ని రక్షించుకోవాల్సిన అంశంపై ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. విద్యావేత్త, ఎమ్మెల్సీ ప్రొ. ఎం.కోదండరామ్, వరంగల్ శాతవాహన యూనివర్శిటీ ఆచార్యులు ప్రొ. సూరేపల్లి సుజాత, ప్రముఖ రచయిత్రి గోగు శ్యామల, 1969 ఉద్యమకారులు శంకర్‌రావు, అన్వర్‌పటేల్ తదితర ప్రముఖులు హాజరై ప్రసంగించారని తెలిపారు.

● సోప్ ఫ్యాక్టరీ వీధిలో రోడ్డు మరమ్మతులు



ఈనెల 8వ తేదీన 'డ్రైనేజీ పైప్‌లైన్లు వేశారు.. రోడ్డు వేయడం మరిచారు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించారు. సోమవారం చిక్కడపల్లిలోని సోప్ ఫ్యాక్టరీ వీధిలో తవ్విన చోట రోడ్డు మరమ్మతులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి

ఆలయాల అభివృద్ధికి సహకారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గాంధీనగర్ డివిజన్ దోబీఘాట్ బస్తీలోని శ్రీ ఈదమ్మ ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముఠా నరేష్, కుమారస్వామి, నవీన్‌యాదవ్, బస్తీవాసులు మల్లికార్జున్, వెంకటేష్, క్రాంతి పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్, డైరీని ఆ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి దీన్‌దయాళ్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శంకర్ గౌడ్, చాంద్‌పాషా, మహ్మద్ అలీ, మున్వర్‌చాంద్, జహీరుద్దీన్ సమర్, ప్రవీణ్, మగ్బుల్, శ్రావణ్ పాల్గొన్నారు. - ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

ప్రేమ్‌నగర్‌లో పవర్ బోరు ప్రారంభం


పవర్ బోరును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో మంచినీటి పవర్‌బోరును కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. నీటి ఎద్దడి సమస్య తెలుసుకుని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తన సీడీపీ నిధులతో పవర్ బోరును ఏర్పాటు చేయించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్, జలమండలి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్.. ఆర్టీసీ జేఏసీతో చర్చలు వాయిదా

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేయాలని, తదితర డిమాండ్ల సాధనకు టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో గత నెల 27న సమ్మె నోటీసు ఇచ్చామని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఇ.వెంకన్న తెలిపారు. ఈ మేరకు స్పందించిన కార్మికశాఖ అధికారులు సోమవారం సాయంత్రం జేఏసీ నాయకులతో పాటు, ఆర్టీసీ యాజమాన్యాన్ని చర్చలకు పిలిచారని తెలిపారు. ఆర్టీసీ యాజమాన్యం తరఫున అధికారులు చర్చలకు రాకపోవడం విచారకరమన్నారు. తమతో కాసేపు మాట్లాడిన కార్మికశాఖ సంయుక్త కమిషనర్ సునీతాగోపాల్‌దాస్ ఈనెల 3 నుంచి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని చర్చలను వాయిదా వేసి మరో తేదీన పిలుస్తామని చెప్పారన్నారని తెలిపారు. జేఏసీ వైస్‌చైర్మన్ థామస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పేరుతో సమ్మె నోటీసును దాటవేసే ధోరణితో ప్రభుత్వం ఆర్టీసీ యాజమాన్యం వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో నేతలు మౌలానా, యాదగిరి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్ల వరకు ఇవే నీళ్లు..

(5వ పేజీ తరువాయి)

అందిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు ప్రస్తుతం సరఫరా చేసే నీరు ఏమాత్రం సరిపోవడం లేదు.

అదనపు జలాలు తీసుకురాకపోవడం వల్లే..

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కృష్ణా ఫేజ్-3, గోదావరి ఫేజ్-1 ప్రాజెక్టులతో నగరానికి నీళ్లు అందుతున్నాయి. ఆ సమయంలో 1200మిలియన్ లీటర్ల నీళ్లు నగరానికి చేరడంతో అప్పట్లో నీటి ఇబ్బందులు తలెత్తలేదు. హైదరాబాద్ మహానగరం ఈ పదేళ్లలో ఔటర్ రింగ్‌రోడ్డును హద్దుగా చేసుకొని శరవేగంగా విస్తరిస్తోంది. గేటెడ్ కమ్యూనిటీ కాలనీలు, బహుళ అంతస్తుల భవనాలు పెద్దఎత్తున వస్తున్నాయి. పదేళ్ల క్రితం వరకు నగరంలో ఏ స్థాయిలో (2600మిలియన్ లీటర్లు) నీళ్లు వచ్చాయో.. ప్రస్తుతం అంతే వస్తున్నాయి. ఈ పదేళ్లలో అదనంగా జలాలు తీసుకొచ్చేందుకు ఒక్క ప్రాజెక్టు చేపట్టలేదు. ప్రస్తుతం నగరంలో సరఫరా అవుతున్న జలాలనే మరో రెండేళ్ల వరకు సరిపుచ్చుకోవాల్సిన అవసరముందని, గోదావరి రెండో ఫేజ్ జలాలు అందితేనే పూర్తిస్థాయిలో నీళ్లు ఇవ్వగలమని అధికారులు అంటున్నారు.

మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలి

● ఎంపీ డా.లక్ష్మణ్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ డా.కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆయన అశోక్‌నగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.లక్ష్మణ్ మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు నిత్యం బీజేపీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ ఎన్నికల విజయంతో పార్టీ శ్రేణులు నూతనోత్సాహంతో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు పూస రాజు, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, శ్రీనివాస్, నర్సింహ, ఆనంద్‌రావు, యాదగిరి, నీరజ్, సంయుక్తరాణి, కృష్ణవేణి పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ లక్ష్మణ్ తదితరులు

గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీకి వంద సీట్లు

● ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు దీపక్‌రెడ్డి


దీపక్‌రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కన్నె ఉమాదేవి తదితరులు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ వంద సీట్లు సాధిస్తుందని ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో ప్రజలు విరక్తి చెందారని తెలిపారు. గ్రేటర్‌పై కమలం జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా దీపక్‌రెడ్డిని మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్యప్రకాష్ సింగ్, సి.కృష్ణగౌడ్, ఏడెల్లి అజయ్‌కుమార్, క్షీరసాగర్, సుభాష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు


కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూసఫ్ షరీఫ్, బాల్‌రాజ్ తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీరమణ చౌరస్తా సమీపంలోని శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి తెలిపారు. సోమవారం శ్మశాన వాటిక ప్రతినిధులు యూసఫ్ షరీఫ్, బాల్‌రాజ్ శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మించాలని కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి ప్రహరీకి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.


కళ్యాణీని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినికి సత్కారం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జనవరి 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ ప్రధాన కవాతులో పాల్గొన్న నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకామ్ తృతీయ సంవత్సరం విద్యార్థిని కళ్యాణీని సోమవారం కళాశాలలో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొంటే మంచి ప్రతిభతోపాటు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, జాతీయ భావాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ రాపోలు శ్రీనివాస్, డాక్టర్ సి.సత్యనారాయణరెడ్డి, డాక్టర్ బాలస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సీవీఎల్.నారాయణ, సూర్యకుమారి, వై.ఉమ, విద్యార్థి కో-ఆర్డినేటర్లు సాగర్, అక్షర, భవాని, రష్మిత, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

రాంనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానికసంస్థల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ప్రజలను మభ్యపెడుతుందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై వెలువడ్డ ప్రజల అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో పార్టీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పలుస బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, కప్ప కృష్ణగౌడ్, నాగు నగేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

పదవిలో ఉన్నవారికి సేవాభావం ఉంటే సమాజానికి మేలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పదవిలో ఉన్న వారిలో సేవాభావం ఉంటే సమాజం గొప్పగా ఉంటుందని, మేలు జరుగుతుందని రిటైర్డ్ ఐఏఎస్ డా. కేవీ రమణాచారి అన్నారు. రాష్ట్రపతి కార్యాలయంలో అధికారిగా కంటే టీటీడీ ఈవోగా ఎందరో కళాకారులకు సేవ, సహాయం చేసే భాగ్యం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న డా. కేవీ రమణాచారి జన్మదిన వేడుకల సందర్భంగా సోమవారం గానసభలో మిమిక్రీ మ్యాజిక్ మైమ్ కళా ప్రదర్శనలతోపాటు మాధవీశర్మ, అనీల శిష్య బృందం నృత్యప్రదర్శన ఆకట్టుకునేలా జరిగాయి. అనంతరం జరిగిన సభలో రమణాచారి మాట్లాడుతూ మైమ్, మిమిక్రీ, మ్యాజిక్ తక్కువ సమయంలో నేర్చుకోవచ్చని, ఆర్‌సీఎం రాజు తన గళంతో సినీ పరిశ్రమలో వెలుగుతున్నారని, అలాగే చొక్కాపు రమణ, జెన్నీ వంటి వారు వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ రమణాచారి పుట్టినరోజు అయిన ఫిబ్రవరి మాసం మొత్తం కళాకారులకు పండుగరోజు అన్నారు. నటుడు జెన్నీ, వ్యక్తిత్వ వికాసనిపుణులు జీవీఎస్ రాజు, బాలసాహిత్య రచయిత చొక్కాపు రమణ ప్రసంగించారు. కార్యక్రమ నిర్వాహకులు మల్లం రమేష్ మాట్లాడుతూ మైమ్ కళలో కళాకారులు తక్కువగా ఉన్నారని మైమ్‌లో శిక్షణ శిబిరం నిర్వహణకు రమణాచారి సహకారం కావాలి అని కోరగా, అందుకు అంగీకరించారు.


డా. కేవీ రమణాచారిని సన్మానిస్తున్న నిర్వాహకులు

సొంత కార్లు.. అద్దె వాహనాలుగా..

(5వ పేజీ తరువాయి)

యువతకు అందించింది. కొందరు అధికారులు డీఓసీ డ్రైవర్లను వేధించి.. తమ వద్ద పని చేయకుండా చేశారు. అనంతరం సొంత కార్లను అద్దె వాహనాలుగా వినియోగిస్తూ వచ్చారు. జీహెచ్‌ఎంసీలో దాదాపు 800మంది అధికారులకు వాహన సదుపాయం ఉంది. ఇందులో సంస్థ సొంత, అద్దె వాహనాలున్నాయి. ప్రాథమిక పరిశీలనలో గుర్తించిన 26 మందికి నోటీసులు ఇవ్వగా.. కేంద్ర, జోనల్, సర్కిల్ కార్యాలయాల పరిధిలో సొంత కార్లను అద్దె వాహనాలుగా ఎంత మంది వినియోగిస్తున్నారన్న వివరాలపై ఆరా తీస్తున్నారు. సొంత కార్లను అద్దె వాహనాలుగా చూపుతోన్న అధికారులు 80 మందికిపైగా ఉంటారని రవాణా విభాగం వర్గాలు చెబుతున్నాయి. వీరికి యేటా రూ.3.26 కోట్లు చెల్లిస్తున్నారు.